క్లుప్తంగా

ఆర్థిక సాయం



వెంకటాపురం(కె): మండలంలోని రంగ రాజాపురం కాలనీకి చెందిన అట్టం వెంకన్న ఇటీవల క్యాన్సర్ వ్యాధితో మృతి చెందగా బాధిత కుటుంబానికి తాపీ వర్కర్స్ యూనియన్ మండల కమిటీ నాయకులు మంగళవారం ఆర్థిక సాయం అందించారు. ఈ సందర్భంగా యూనియన్ మండల ఉపాధ్యక్షుడు సకినాల బాలకృష్ణ రూ. 11వేలు నగదును వెంకన్న భార్య నర్సమ్మకు అందించారు. ఈ కార్యక్రమంలో బుర్రి క్రాంతి కుమార్, నాగూర్, చంటి, నాగర్జున, సాంబ తదితరులు పాల్గొన్నారు.

మెడికల్ ల్యాబ్ ప్రారంభం

వాజేడు: మండలంలోని జగన్నాథపురంలో ప్రైవేట్ మెడికల్ ల్యాబ్‌ను బీఆర్ఎస్ పార్టీ భద్రాచలం డివిజన్ నాయకుడు బుచ్చయ్య మంగళవారం ప్రారంభించారు. రక్తపరీక్షలు చేయించుకునేందుకు ప్రజలు పట్టణాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా స్థానికంగా మెడికల్ ల్యాబ్ ఏర్పాటు చేయడం సంతోషకరమన్నారు.

నేడు ఉచిత దంత వైద్యశిబిరం

ఏటూరునాగారం: మండల కేంద్రంలోని ఆర్ఐటీఐ ఆవరణంలో నేడు(బుధవారం) ఉచిత దంత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు ఆర్ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్‌రావు మంగళవారం ప్రకటనలో తెలిపారు. పంటి సమస్యతో బాధపడుతున్న వారు ఉచితంగా చికిత్స పొందవచ్చని తెలిపారు. మండలంలోని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కుల వృత్తులకు సాయం హర్షణీయం

కన్నాయిగూడెం: కులవృత్తి దారులకు రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ రూ. లక్ష ఆర్థిక సాయం అందించడం హర్షనీయమని శాలివాహన సంఘం మండల అధ్యక్షుడు కల్వచర్ల భిక్షపతి అన్నారు. మండల కేంద్రంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కులవృత్తిదారులను బలోపేతం చేసేందుకు ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం ఎంతో గొప్పదని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాజన్న, మల్లయ్య, నర్సింగరావు, కేశవరావు నాగరాజు, గౌరిశంకర్ తదితరులు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ

ఏటూరునాగారం: మండలంలోని వైజంక్షన్ వద్ద స్థానిక పోలీస్‌లు వాహనాలను తనిఖీ చేశారు. రెండో ఎస్సై లాల్ సిబ్బందితో ఛత్తీస్‌గఢ్, తదితర ప్రాంతాలకు వెళ్లే వాహనాలను క్షుణ్ణంగా పరిశీలించి, అనుమానితంగా కనిపించిన వ్యక్తులను ప్రశ్నించి వదిలేశారు. నక్సల్స్ ప్రభావిత ప్రాంతమవడంతో ముందస్తు చర్యల్లో భాగంగా తనిఖీలు చేపట్టినట్లు తెలిపారు. ప్రతీ వాహనదారుడు సరియైన పత్రాలు కలిగి ఉండాలని సూచించారు.

ఆత్మస్థైర్యంతో ముందుకెళ్లాలి

ములుగు రూరల్: దివ్యాంగులు ఆత్మస్థైర్యంతో



ముందుకెళ్లాలని ములుగు, భూపాలపల్లి జిల్లాల సబ్‌రిజిస్ట్రార్ తస్లీమా మహ్మద్ అన్నారు. మండలంలోని ఇంచర్లకు చెందిన జంబోజు రాకేష్ అనే దివ్యాంగుడి జన్మదిన వేడుకలకు మంగళవారం ఆమె కుటుంబ సభ్యులతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా కేక్‌కట్ చేసి స్వీట్లు తినిపించారు. అనంతరం నూతన వస్త్రాలు అందించారు. అంగవైకల్యం శరీరానికే తప్ప మనసుకు కాదని ధైర్యంగా ఉండాలని సూచించారు.

అక్షరాభ్యాసం చేపట్టాలి

మంగపేట: మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో అక్షరాభ్యాసం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు మండల ఇంచార్జి ఎంఈఓ మంగళవారం ప్రకటనలో తెలిపారు. ఐదవ తరగతి పూర్తయిన విద్యార్థులను సమీపంలోని జడ్పీ ఉన్నత పాఠశాలల్లో చేర్పించాల్సి ఉంటుందని, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు తగిన చర్యలు చేపట్టాలని సూచించారు.

గుడిసెలను కూల్చి వేయడం సరికాదు

ములుగు రూరల్: మహబూబాబాద్‌లో నిరుపేదల గుడిసెలను కూల్చి వేయడం సరికాదని సీపీఎం జిల్లా కార్యదర్శి తుమ్మల వెంకట్‌రెడ్డి మంగళవారం ప్రకటనలో తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల సమయంలో నిరుపేదలకు ఇళ్ల స్థలాలను కేటాయిస్తామని హామీ ఇచ్చి మోసం చేసిందని ఆరోపించారు. సీఎం కేసీఆర్ ఇళ్ల స్థలాలు కేటాయించకపోగా ప్రభుత్వ స్థలంలో నిరుపేదలు ఏర్పాటు చేసుకున్న గుడిసెలను తొలగించడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. జూలై నెలలో గృహలక్ష్మీ పథకం కింద ఇంళ్ల నిర్మాణాలు చేపడతామని, నిరుపేదల గుడిసెలను తొలగించడం దుర్మార్గమని మండిపడ్డారు. జీఓ నెంబర్ 58 ప్రకారం పేదలు వేసుకున్న ఇండ్లకు పట్టాలు అందించాలని డిమాండ్ చేశారు.

5వేల మందితో యువ నేతాజీ ఫౌండేషన్



వరంగల్ నగరానికి చెందిన యువ నేతాజీ ఫౌండేషన్ రక్తదానం ప్రాధాన్యతను తెలుపుతూ.. ఆపదలో ఉన్న వారికి స్వచ్ఛందంగా రక్తదానం చేస్తూ ముందుకు సాగుతోంది. ఈ ఫౌండేషన్‌కు కొత్తకొండ అరుణ్‌కుమార్ అధ్యక్షుడిగా కొనసాగుతుండగా ఇందులో 5వేల మంది సభ్యులుగా ఉన్నారు. ఇప్పటివరకు 35వరకు క్యాంపులు నిర్వహించి రక్తం సేకరించి తలసేమియా బాధిత పిల్లలకు రక్తం అందించారు. వీరి సేవలకుగాను మూడు అవార్డులు కూడా వచ్చాయి. గవర్నర్ తమిళిసై సౌందర రాజన్ చేతులమీదుగా బెస్ట్ బ్లడ్ మోటివేటర్ అవార్డు కూడా అందుకున్నారు. వీరి ఫౌండేషన్ నిర్వహణలో 25 వాట్సాప్ గ్రూప్‌లు ఏర్పాటుచేసి ఆపదలో ఉన్న వారికి అవసరమైన రక్తం అందిస్తూ ప్రాణాలు కాపాడుతున్నారు. బుధవారం ఎంజీఎం బ్లడ్‌సెంటర్‌లో ప్రత్యేక క్యాంప్ ఏర్పాటు చేశారు.

రక్తదాన చైతన్య యుద్ధంలో నేను సైతం..



ఆయన వృత్తి పోలీస్ కానిస్టేబుల్.. ప్రవృత్తి రక్తదానం.. దాతలను ప్రోత్సహించడం. వరంగల్ పోలీస్ కమిషనరేట్‌లో ఏఆర్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న వరంగల్ జిల్లా, ఖానాపురం మండలం, రాగంపేట గ్రామానికి చెందిన కన్నె రాజు (స్విమ్మర్ రాజు) కాలేజీ రోజులనుంచి రక్తదానం చేస్తున్నారు. 2005నుంచి ఇప్పటివరకు 31సార్లు (ఓ పాజిటివ్) రక్తదానం చేశారు. ఇప్పుడు నేతాజీ ఫౌండేషన్‌లో బ్లడ్ మోటివేటర్‌గా పనిచేస్తూ ఎంతోమందికి రక్తదానంపై అవగాహన కల్పించారు. సామాజిక మాధ్యమాల ద్వారా 85,000 మందికిపైగా యువతకు అవగాహన కల్పించారు.

రక్తదానంలో రా'రాజు'



జనగామ పట్టణం ధర్మకంచకు చెందిన మల్లిగారి రాజు ఇప్పటివరకు 86 సార్లు రక్తదానం చేసి తనలోని మానవత్వాన్ని చాటుకున్నారు. 1997లో తన మేనమామ ఇర్సం కిషన్ రైలు ప్రమాదంలో చేయి పోగొట్టుకొని అత్యవసర సమయంలో రక్తం అందుబాటులో లేక చనిపోయాడు. దీంతో కలత చెందిన రాజు మరొకరికి ఇలాంటి పరిస్థితి రావొద్దని నాటినుంచి నేటి వరకు ఏడాదికి నాలుగు సార్లు రక్తదానం చేస్తూ, పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నారు. వరంగల్, హైదరాబాద్ ఇలా ఎక్కడికి వెళ్లినా సొంత డబ్బులు ఖర్చు చేసుకొని రక్తదానం చేయడం అలవాటుగా మార్చుకున్నారు.

రక్తం ఇవ్వండి.. జీవితాన్ని పంచుకోండి

ఈ ఏడాది నినాదం ఏమిటంటే.. నేడు (14 జూన్ 2023న) జరుపుకునే ప్రపంచ రక్తదాతల దినోత్సవ ప్రచార నినాదం "రక్తం ఇవ్వండి.. ప్లాస్మా ఇవ్వండి.. జీవితాన్ని పంచుకోండి.. తరచూ పంచుకోండి." ..ఇది ప్రపంచ ఆరోగ్యసంస్థ ప్రకటించింది.



- రక్తదాన ప్రాధాన్యతను గుర్తుచేసిన బాలాసోర్ రైలు ప్రమాదం
- స్వచ్ఛందంగా తరలివచ్చిన యువకులు, గ్రామస్తులు
- ఇదే స్ఫూర్తితో ఉమ్మడి జిల్లాలో వేలాదిమంది రక్తదాతలు
- సామాజిక మాధ్యమాల ద్వారా సమాచార మార్పిడి
- నేడు ఉమ్మడి జిల్లాలో పలుచోట్ల రక్తదాన శిబిరాలు
- నేడు ప్రపంచ రక్తదాతల దినోత్సవం

వరంగల్ డెస్క్: రక్తదానం.. ప్రాణదానం ఒక్కటే. ఆపదలో ఉన్న వ్యక్తిని ఆదుకునేది రక్తం ఒక్కటే. ఏదైనా ప్రమాదంలో గాయపడిన వ్యక్తికి తక్షణ అవసరం రక్తం. అదే సకాలంలో అందితే మనిషి ప్రాణాపాయంనుంచి బయటపడతాడు. ఏ మాత్రం ఆలస్యం చేసినా నిండు ప్రాణాలు గాలిలో కలిసిపోతాయి. ఇక.. రక్తమార్పిడిపై ఆధారపడిన రోగుల జీవన నాణ్యతను మార్చేది సురక్షితమైన రక్తం. ఇలాంటి వారికి సహాయపడడానికి ఆరోగ్యంగా ఉన్న వ్యక్తులు క్రమంతప్పకుండా.. సురక్షితంగా.. సాధ్యమైనప్పుడల్లా రక్తదానం చేయొచ్చు. రక్తదానంపై ఉన్న ఎన్నో అపోహలను తొలగించేందుకు అనేక స్వచ్ఛంద సంస్థలు, అధికార యంత్రాంగం, వైద్యారోగ్యశాఖలు అనేక కార్యక్రమాలు చేపడుతున్నాయి. ఉమ్మడి వరంగల్ జిల్లాలో పలుచోట్ల స్వచ్ఛంద సంస్థలు, వైద్యారోగ్యశాఖలు బుధవారం వేర్వేరుగా రక్తదాన శిబిరాలు నిర్వహిస్తున్నాయి. నేడు ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా పదులసార్లు రక్తదానం చేసిన, ఇతరులను ప్రోత్సహిస్తున్న దాతలపై ప్రత్యేక కథనం.

బాలాసోర్ రైలు ఘటనలో...



ఒడిశా రాష్ట్రం భువనేశ్వర్ జిల్లా బాలాసోర్ వద్ద ఇటీవల జరిగిన ఘోర రైలు ప్రమాదంలో వందలాది మంది ప్రయాణికులు తీవ్ర రక్తస్రావాన్ని చవిచూసిన నేపథ్యంలో రక్తకొరత తీర్చేందుకు స్థానికులు, సమీప ప్రాంత ప్రజలు స్వచ్ఛందంగా ఆస్పత్రులకు తరలివచ్చి రక్తదానం చేశారు. దీనికి సంబంధించి అక్కడి అధికారిక వర్గాల ప్రకారం.. బాలాసోర్, భద్రక్, కటక్‌లలో 3,000 మందికి పైగా రక్తదానం చేశారు. దీంతో చాలామంది క్షతగాత్రులకు వైద్యం అందించి ప్రాణాలు కాపాడారు. రక్తదానం చేసిన ప్రతి ఒక్కరిని సమాజం అభినందనలతో ముంచెత్తింది. ఆపద వచ్చినప్పుడు ఇలాంటి స్ఫూర్తి మనందరిలో కలగాల్సిన అవసరం ఉంది.

అరుదైన ఓ నెగెటివ్ బ్లడ్ దాత



గ్రేటర్ వరంగల్ నగరం 16వ డివిజన్ ధర్మారానికి చెందిన హెడ్‌కానిస్టేబుల్ జి.జయరాజుది ఓ నెగెటివ్ బ్లడ్ గ్రూప్. ఇది చాలా అరుదు. 1990లో హనుమకొండ ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీ మైదానంలో దివంగత ప్రధాని రాజీవ్ గాంధీ బహిరంగ సభ ఉండగా ఆయన బ్లడ్ గ్రూపు ఓ నెగెటివ్ కలిగిన జయరాజును ముందు జాగ్రత్తగా వేదిక పక్కన అంబులెన్స్‌లో సిద్ధంగా ఉంచారు. తన 34 ఏళ్ల సర్వీసులో 32 సార్లు రక్తదానం చేసి పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నారు.

విష్ణువర్ధన్ @ 30 సార్లు



మహబూబాబాద్ జిల్లా కేసముద్రానికి చెందిన పానుగంటి విష్ణువర్ధన్ ఇప్పటివరకు 30సార్లు రక్తదానం చేశారు. ఓ పాజిటివ్ గ్రూప్ గల విష్ణువర్ధన్ ఆపదలో ఉన్న ఎంతోమంది ప్రాణాలు కాపాడడంలో తనవంతు సాయం అందించారు. కాలేజీ చదివే రోజుల్లో మొదటిసారి రక్తదానం చేసిన విష్ణువర్ధన్.. ఇప్పటివరకు ఆపదలో ఉన్న వారిని ఆదుకోవడం కోసం ముందుకు సాగుతున్నారు. రక్తం అవసరమైన వారు సమాచారం అందిస్తే తక్షణమే ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నానని విష్ణు 'సాక్షి'తో తెలిపారు.

ప్రదీప్ @ 42సార్లు



జయశంకర్ భూపాలపల్లి జిల్లా భూపాలపల్లి మండలం దూదేకులపల్లి గ్రామానికి చెందిన గుమ్మడి ప్రదీప్ 2006 సంవత్సరం నుంచి ఇప్పటివరకు 42 సార్లు రక్తదానం చేశారు. అత్యవసర పరిస్థితుల్లో రక్తం అవసరమైన వారు ఫోన్ చేస్తే చాలు ఎంతదూరమైనా వెళ్లి రక్తం ఇచ్చి వస్తుంటారు. దీంతోపాటు వివిధ సందర్భాల్లో ఏర్పాటుచేసే రక్తదాన శిబిరాల్లో స్వచ్ఛందంగా వెళ్లి రక్తదానం చేస్తుంటారు. తలసేమియా బాధితులకు రక్తం ఎంతో అవసరమని, తనది వారికి ఉపయోగపడితే ఎంతో సంతోషంగా ఉంటుందని ప్రదీప్ తెలుపుతున్నారు.

సతీష్‌రెడ్డి @ 66సార్లు



జయశంకర్ భూపాలపల్లి జిల్లా టేకుమట్ల మండలం జడల్‌పేటకు చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు కామిడి సతీష్‌రెడ్డి 66 సార్లు రక్తదానం చేశారు. 2015లో అప్పటి గవర్నర్ నరసింహన్ చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. రక్తదానంపై యువత ఎలాంటి అపోహాలకు లోను కాకుండా ముందుకు రావాలని సతీష్‌రెడ్డి కోరుతున్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి



ములుగు రూరల్ : ప్రిన్సిపాల్‌ను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

ములుగు రూరల్: ప్రస్తుత సమాజంలో పురుషులతో సమానంగా మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని మైనారిటీ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ శైజల అన్నారు. తెలంగాణ మహిళా సంక్షేమ దినోత్సవాన్ని పురస్కరించుకొని మండలంలోని దేవగిరిపట్నం మైనారిటీ గురుకుల పాఠశాలలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు తెలంగాణ దశాబ్ది ఉత్సవాలలో భాగంగా అమర వీరులకు నివాళులర్పించారు. పాఠశాలలో ఉత్తమ సేవలు అందిస్తున్న ఉపాధ్యాయులు, బోధనేతర సిబ్బందికి శాలువాలతో సన్మానించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ శైజల మాట్లాడుతూ నేటి సమాజంలో మహిళలు పురుషులతో సమానంగా రాణించాలని, మహిళల తమ హక్కులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు , సిబ్బంది పాల్గొన్నారు.

వెంకటాపురం(కె)లో..

వెంకటాపురం(కె) మండలంలోని ఆలుబాక మహిళా ఆరోగ్య కేంద్రంలో మంగళవారం మహిళలకు ఉచిత వైద్యపరీక్షలు నిర్వహించారు. ఎదిర వైద్యాధికారి భవ్యశ్రీ ఆధ్వర్యంలో 91 మంది మహిళలకు వైద్య పరీక్షలను నిర్వహించి రక్త నమూనాలు సేకరించారు. శాంపిల్లను ములుగు ఏరియా ఆస్పత్రికి పంపించినట్లు ఆమె వెల్లడించారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కలాం మాటలను ఆదర్శంగా తీసుకోవాలి



డాక్టరేట్ పొందిన సురేష్‌ను సన్మానిస్తున్న ఎస్సై

వెంకటాపురం(ఎం): కలలు కనండి వాటిని సాకారం చేసుకోండి అని దివంగత మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాం చెప్పిన మాటలను నేటి యువత ఆదర్శంగా తీసుకొని ముందుకెళ్లాలని స్థానిక ఎస్సై తాజుద్దీన్ అన్నారు. మండలంలోని లక్ష్మీదేవిపేట గ్రామానికి చెందిన బీరెల్లి సురేష్ ఇటీవల డాక్టరేట్ పొందగా మంగళవారం కలాం ఫౌండేషన్ ఆధ్వర్యంలో సురేష్‌ను సత్కరించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడారు. ప్రతీ విద్యార్థి తమ తల్లిదండ్రుల ఆశయాలను నేరవేర్చి ఉన్నతంగా జీవించాలన్నారు. గ్రామీణ ప్రాంతానికి చెందిన సురేష్ ఎంచుకున్న లక్ష్యాన్ని సాధించి డాక్టర్‌గా రాణించడం ఎంతో గర్వకారణమని ఎస్సై అభినందించారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ ఫౌండర్ సర్వర్ అహ్మద్, సర్పంచ్ కుమారస్వామి, స్థానిక హెచ్ఎం రాందేవ్, ఫౌండేషన్ సభ్యులు సలేంద్రం, రమేష్, భానుప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

వెంకటాపురం(కె): ద్విచక్ర వాహనం అదుపుతప్పి వ్యక్తి గాయాల పాలైన సంఘటన మండలంలోని బర్లగూడెంలో మంగళవారం చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. బర్లగూడెం గ్రామానికి చెందిన శ్యామ్‌సుందర్ తన ద్విచక్రవాహనంపై బర్లగూడెం నుంచి వెంకటాపురం మండల కేంద్రానికి వస్తున్నాడు. ఎదుల్ల చెరువు సమీపంలో ద్విచక్రవాహనం అదుపుతప్పి పల్టీ కొట్టింది. దీంతో శ్యామ్‌సుందర్ తలకు తీవ్రగాయాలు అవడంతో అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. గమనించిన గ్రామస్తులు 108కు సమాచారం అందించడంతో సంఘటన స్థలానికి చేరుకున్న సిబ్బంది క్షతగాత్రుడిని వెంకటాపురం ఆస్పత్రికి తరలించారు. మెరుగైన చికిత్స నిమిత్తం భద్రాచలంలోని ఆస్పత్రికి తరలించినట్లు తెలిసింది. కాగా శ్యామ్‌సుందర్ వద్ద రూ. 5 వేల నగదు, సెల్ ఫోన్‌లను 108 సిబ్బంది ప్రవీణ్, పైలట్ రవీందర్‌లు స్థానిక పోలీసులకు అప్పగించారు.

జగదీశ్ సేవలు చిరస్మరణీయం



ఎస్ఎస్‌తాడ్వాయి: ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు



ఏటూరునాగారంలో..



వాజేడులో..

ఎస్ఎస్ తాడ్వాయి: జెడ్పీచైర్మన్ కుసుమ జగదీశ్ జిల్లాకు చేసిన సేవలు చిరస్మరణీయమని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మల్లయ్య అన్నారు. ఆయన మృతికి సంతాపంగా మండల కేంద్రంలో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు జాతీయ రహదారిపై కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. జగదీష్ చిత్రపటం వద్ద కొవ్వొత్తులు వెలిగించి, రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఇంద్రారెడ్డి, ఏటూరునాగారం ఆత్మ చైర్మన్ దుర్గం రమణయ్య, గ్రామ కమిటీ అధ్యక్షుడు బంగారు సాంబయ్య, నాయకులు పిన్నింటి యాదిరెడ్డి, చంద్రయ్య, వసంతరావు, రజినీకర్‌రెడ్డి, జైపాల్‌రెడ్డి, మహిపాల్‌రెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఏటూరునాగారం: గుండెపోటుతో మృతిచెందిన జెడ్పీచైర్మన్ జగదీశ్ ఆత్మకు శాంతిచేకూరాలని కోరుతూ మంగళవారం మండల కేంద్రంలో బీఆర్ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, తదితర పార్టీల నాయకులు, ప్రజలు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. బస్టాండ్‌లోని తెలంగాణ తల్లి విగ్రహం నుంచి రామాలయం వరకు ర్యాలీ నిర్వహిస్తూ జోహార్ జగదీశ్ అంటూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ విజయ, జెడ్పీ కోఆప్షన్ సభ్యురాలు వలియాబీ, కన్నాయిగూడెం జెడ్పీటీసీ చందు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సునీల్‌కుమార్, మల్లారెడ్డి, సలీం, కిరణ్, చిన్ని, మహేష్, రఘు, స్వరూప, లక్ష్మి, ఖాజాపాషా, రామకృష్ణ, చంద్రబాబు, బోజారావు, రాంనర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

వాజేడు: ములుగు జెడ్పీచైర్మన్ కుసుమ జగదీశ్ అకాల మరణానికి సంతాపంగా మండల కేంద్రంలో బీఆర్ఎస్‌పార్టీ నాయకులు మంగళవారం రాత్రి కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. జగదీష్ చిత్రపటానికి నివాళులర్పించి ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని కోరుతూ నినాదాలను చేశారు. ఈ కార్యక్రమంలో తిరుపతి, రమణారావు, దత్తుడు, యల్లయ్య, వెంకటేశ్వర్లు, సతీష్, శ్రీను, మీనయ్య, సాంబశివరావు, వెంకటరెడ్డి ఉన్నారు.



మంగపేట: కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు, ప్రజలు

మంగపేట: తెలంగాణ మలిదశ ఉద్యమ నేత, ములుగు జడ్పీ చైర్మన్, కుసుమ జగదీశ్ అకాల మరణం బాధాకరమని బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు కుడుముల లక్ష్మినారాయణ అన్నారు. ఈ మేరకు మంగళవారం రాత్రి కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా మండల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు మండల కేంద్రంలోని బస్టాండ్ సెంటర్ నుంచి తెలంగాణ సెంటర్ వరకు పెద్దెత్తున కొవ్వొత్తుల ర్యాలీ చేపట్టారు. జగదీశ్‌తో ఉన్న అనుబంధాన్ని గుర్తుచేసుకుంటూ కన్నీరు పెట్టారు. మండలంలో ఆయన చేసిన అభివృద్ధి పనులను, సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో మండల సీనియర్ నాయకులు, ట్రస్టిబోర్డు డైరెక్టర్లు, బిఆర్ఎస్ అనుబంధ సంఘాల నాయకులు, గ్రామ కమిటీల నాయకులు, ఎఫ్ఎస్‌సిఎస్ చైర్మన్, వైస్ చైర్మన్, డైరెక్టర్లు, మండల రైతుబంధు కోఆర్డినేటర్లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



వెంకటాపురం(కె)లో..

తెలంగాణ తల్లి విగ్రహం వద్ద శ్రద్ధాజలి ఘటిస్తున్న బిఆర్ఎస్ నాయకులు

వెంకటాపురం(కె): ములుగు జిల్లా జెడ్పీచైర్మన్ కుసుమ జగదీశ్ అకాల మరణం జిల్లా ప్రజలకు, పార్టీకి తీరని లోటని జెడ్పీటీసీ రమణ అన్నారు. ఈ మేరకు మండల కేంద్రంలో కొవ్వొత్తుల ర్యాలీ చేపట్టారు. జగదీశ్ పవిత్ర ఆత్మకు శాంతిచేకూరాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్‌పార్టీ మండల అధ్యక్షుడు రాంబాబు, మండల కార్యదర్శి మురళి, అధికార ప్రతినిధి దామోదర్, శాంతమూర్తి, ప్రసాద్, నాగేశ్వరావు, వేణు, మధు పాల్గొన్నారు.

ఘనంగా ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన పూజలు



ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

వెంకటాపురం(ఎం): మండలంలోని పాలంపేట ప్రసన్నాంజనేయస్వామి దేవాలయంలో ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన పూజలు మంగళవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆలయ చైర్మన్ కొంక జనార్దన్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. నిత్యవిధి, అగ్నిప్రతిష్ఠా, హవణం, పూర్ణాహుతి, జల, క్షీర, ఫల పుష్పాధాన్య హోమములను అర్చకుడు పురుషోత్తమాచార్యులు నిర్వహించారు. నేడు(బుధవారం) ఉదయం ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన ఉంటుందని, గ్రామ ప్రజలు అధిక సంఖ్యలో తరలివచ్చి పూజ కార్యక్రమాల్లో పాల్గొనాలని చైర్మన్ పిలుపునిచ్చారు. మధ్యాహ్నం మహాఅన్నదానం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ డోలి రజిత, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు మల్క రమేష్, ఆలయ కమిటీ సభ్యులతో పాటు తదితరులు పాల్గొన్నారు.